సాక్షి గుంటూరు

శుక్రవారం। 11। అక్టోబర్। 2024



దుర్గమాయమ్మ...

బెల్లంకొండ: మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి దేవీ నిలయంలో గురువారం మహాలక్ష్మి అమ్మవారు విజయ దుర్గా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



ధాన్యలక్ష్మీ పాహిమాం

అచ్చంపేట: స్థానిక శ్రీసీతారామస్వామి వారి దేవాలయంలో సీతాదేవి ధాన్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వాసవీ మాత దుర్గాదేవిగా భక్తులను కనువిందు చేశారు.


కనక దుర్గాయైనమః



చుండూరు(వేమూరు): దుర్గాష్టమి సందర్భంగా వలివేరులో అమ్మవారు కనక దుర్గా దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అమ్మను కీర్తించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి రైతుబజారులో రూ. 45కే కిలో టమాటా



కొరిటెపాడు : జిల్లాలోని రైతు బజారుల్లో శుక్రవారం నుంచి కిలో టమోటా రూ. 45కు విక్రయించనున్నట్లు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు బి.రాజబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం, మదనపల్లి జిల్లాల నుంచి టమాటాలను దిగుమతి చేసుకుని, తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

యార్డులో 32,300 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 26,903 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 32,300 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 18,188 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



కనులపండువగా సాగుతున్న ఆదిదంపతుల నగరోత్సవం



దివ్య రూపిణీ..

పాపహారిణీ..

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్లు కొలువైన ఇంద్రకీలాద్రిపై శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. అమ్మవారు గురువారం శ్రీదుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. జగజ్జననిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, పూజల అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. వినాయకుడి గుడి వైపు, కుమ్మరిపాలెం వైపు క్యూలైన్లు కిటకిటలాడాయి. రాత్రి 11 గంటల వరకూ క్యూలైన్లలో భక్తుల రద్దీ కొనసాగింది. వేద విద్వత్ సభ నిర్వహించి రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులను సత్కరించి పురస్కారాలను అందజేశారు. దసరా ఉత్సవాల చివరి రోజు శనివారం ఆది దంపతులకు హంస వాహనంపై తెప్పోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)



దుర్గతులు బాపి...

అమరావతి: పవిత్ర పుణ్యక్షేత్రమైన అమరావతి క్షేత్రంలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా శ్రీ బాల చాముండికా సమేత అమరేశ్వరాలయంలో గురువారం బాలచాముండేశ్వరి అమ్మవారిని దుర్గతులను రూపుమాపే దుర్గాదేవిగా అలంకరించారు. దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవిగా బాల చాముండేశ్వరి అమ్మవారు భక్తులచే పూజలందుకున్నారు. సహస్ర కుంకుమార్చన, దేవీఖడ్గమాల, త్రిశల, లలితా సహస్రనామార్చన, శ్రీచక్రార్చన వంటి పూజకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి దేవాలయం, కోదండరామాలయాల్లో దుర్గాదేవిగా అమ్మవార్లు దర్శనమిచ్చారు.

క్లుప్తంగా

శ్రీ లక్ష్మీదేవికి వెండి మకర తోరణం బహూకరణ



మంగళగిరి: పట్టణంలోని నాంచారమ్మ చెరువులో కల శ్రీ భద్రావతి సమేత భావనా ఋషి ఆలయంలోని ఉపాలయంలో ఉన్న శ్రీ లక్ష్మీదేవికి దాతలు వెండి మకరతోరణం చేయించారు. గురువారం దాతలు గోలి లోకేశ్వరి, గోలి సౌజన్య, అందె ఝాన్సీరాణి, పవన్ కుమార్‌లు రూ.4 లక్షల విలువైన తోరణాన్ని బహూకరించారు. పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం పెద్దల చేతుల మీదుగా అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు దామర్ల కుబేరస్వామి, చింత క్రింది కనకయ్య, రామనాథం పూర్ణచంద్ర రావు, బిట్రా భాస్కరావు, వంగర పెదల క్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల రాజీనామా ఆమోదం

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, మీడియా ప్యానలిస్ట్ పాలిబండ్ల రామకృష్ణ రాజీనామాలను ఆమోదించినట్లు బీజేపీ రాష్ట్ర శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇరువురు నేతలు మహిళలతో అసభ్యకరంగా మాట్లాడినట్లు సోషల్ మీడియాలో కథనాలు రావడంతో, వాటి ఆధారంగా పార్టీ ఆదేశాల మేరకు వారు రాజీనామా చేశారు. సోషల్ మీడియాలో ప్రస్తావనకు వచ్చిన సుకన్యను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు రాష్ట్ర అధిష్ఠానం తెలిపింది.

‘మద్యం’లో ఆ ఇద్దరు..!

- తెనాలి, పొన్నూరులలో దరఖాస్తుకు సిండికేట్లు దూరం
- తమ వారే దరఖాస్తు చేస్తారని పొన్నూరు ఎమ్మెల్యే దౌర్జన్యం
- నగం వాటా కోసం ప్రత్తిపాడు శాసనసభ్యుడి బెదిరింపులు
- మద్యం దుకాణాలకు పోటీలో పది సిండికేట్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మద్యం ఏరులై పారించేందుకు కంకణం కట్టుకుంది. కొత్త మద్యం పాలసీ తీసుకువచ్చి భారీగా ఆదాయం పొందేందుకు పావులు కదుపుతోంది. గుంటూరు జిల్లాలో 127 దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. వాటిని దక్కించుకోవడానికి కొందరు సిండికేట్లుగా మారారు. మరికొన్ని ప్రాంతాల్లో సిండికేట్లు కూడా దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీనికి ప్రధాన కారణం ఆయా నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధులు తమ వారే దరఖాస్తు చేయాలని, వేరే వారు చేస్తే ఊరుకునేది లేదని బెదిరించడమే. షాపు దక్కించుకున్న తరువాత 50 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేయడంతో చాలా మంది పాల్గొనేందుకు వెనుకడగు వేస్తున్నారని తెలుసుకున్న ప్రభుత్వం 9వ తేదీతో ముగియాల్సిన గడువును 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు పొడిగించింది. తద్వారా ఆదాయం మరింత పెంచుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం పది సిండికేట్లుగా ఏర్పడి దరఖాస్తులు పెడుతున్నారు. రాజధాని ప్రాంతమైన తుళ్లూరులో పోటీ తీవ్రంగా ఉంది. సుమారు 65 నుంచి 70 వరకూ దరఖాస్తులు వచ్చాయి. తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో సిండికేట్లు కూడా ముందుకు రావడం లేదు. పొన్నూరు ఎమ్మెల్యే తాము చెప్పిన వారే పోటీలో ఉండాలని దౌర్జన్యం చేస్తుండటంతో చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. అదే విధంగా ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే కూడా షాపు దక్కించుకున్న వారు 50 శాతం వాటా ఇవ్వాలని హుకుం జారీ చేయడంతో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావడం లేదు.



జిల్లాలో 3 వేలకుపైగా దరఖాస్తులు

జిల్లాలో 127 షాపులకుగాను గురువారం సాయంత్రానికి 3,185 దరఖాస్తులు అందాయి. తద్వారా ప్రభుత్వానికి రూ. 63 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. శుక్రవారం కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండటంతో మరిన్ని పెరిగే అవకాశం ఉంది. మద్యం షాపుల కేటాయింపుల్లో ఎమ్మెల్యేలు, టీడీపీ ప్రతినిధుల జోక్యం లేకపోయి ఉంటే సుమారు 5 వేల దరఖాస్తులు అందేవని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

రూ.వెయ్యి పెన్షన్‌తో బతికేదెలా?

పెన్షనర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కేబీ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: నెలకు రూ.వెయ్యి పెన్షన్‌తో భవిష్యనిధి పెన్షనర్లు ఏ విధంగా బతుకుతారని పెన్షనర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కేబీ ప్రసాద్ పేర్కొన్నారు. ఈపీఎస్ పెన్షనర్ల డిమాండ్ల సాధన కోసం గురువారం కృష్ణనగర్‌లోని ప్రాంతీయ భవిష్యనిధి (ఈపీఎఫ్) కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కె.గంగాధర్‌రావు అధ్యక్షత వహించారు. ఈ ధర్నాలో కేబీ ప్రసాద్ మాట్లాడుతూ.. కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని, హయ్యర్ పెన్షన్ దరఖాస్తు ఆమోదించాలని పేర్కొన్నారు. అనంతరం ఈపీఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాజారావు, కోటేశ్వరరావు, ఎస్ఎస్ మన్యం, జి.రవీంద్ర, బీడీ రావు తదితరులు పాల్గొన్నారు.



పత్తి వ్యాపారులపై కేసు

తాడికొండ: రైతులను మోసం చేసిన పత్తి వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వాసు తెలిపారు. గుంటూరు, ఫిరంగిపురం, వట్టిచెరుకూరు గ్రామాలకు చెందిన శెట్టి సుబ్బారావు, ముస్నంగి జోజప్ప, నెరెళ్ళ హరిప్రసాద్‌లు పత్తి వ్యాపారం చేస్తున్నామని, స్పిన్నింగ్ మిల్ ఉందని తెలిపారు. పొన్నెకల్లు గ్రామానికి చెందిన పగడాల రమేష్ కొంత సరుకు ఇప్పించారు. బేజాత్‌పురం గ్రామానికి చెందిన రైతుల నుంచి కూడా సరుకు కొనుగోలు చేసి నమ్మించారు. మొత్తం 81.50 లక్షల నగదు ఇవ్వాల్సి ఉంది. ఆ చెక్కులు కూడా బౌన్స్ కావడంతో తాడికొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పత్తి వ్యాపారులపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యలను బాలికలు ధైర్యంగా ఎదుర్కోవాలి

గుంటూరు వెస్ట్: నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను బాలికలు ధైర్యంగా ఎదుర్కోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. లింగ వివక్ష లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలికలు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. బాలికలు విద్యతోపాటు ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాలని సూచించారు. కుటుంబ అండ ప్రతి ఆడపిల్లకు ఎంతో కీలకమన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన బాలికలను కలెక్టర్ సన్మానించి, ధ్రువప పత్రాలను అందజేశారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి ఎం.ఉమాదేవి, బాలల సంక్షేమ సమితి గుంటూరు చైర్మన్ పీపీ ప్రమీల, జిల్లా బాలల పరిరక్షణాధికారి సీహెచ్ విజయ కుమార్, కె.మేరీ, కిషోరి పాల్గొన్నారు.



సన్మానం పొందిన బాలికలతో కలెక్టర్ తదితరులు

14న భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో ఈ నెల 14న పెన్షన్ అదాలత్, ప్రయాస్ వెబినార్ నిర్వహించనున్నారు. సహాయ పీఎఫ్ కమిషనర్ ఎ.విజయలక్ష్మి గురువారం ఈ విషయాన్ని ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దర్యాప్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. so.guntur@epfindia.gov.in తోపాటు వాట్సాప్ నంబరు 94946 57469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863 - 2344106, 2232921 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు. అదే విధంగా వెబ్ ఎక్స్ ఐడీ 2643 878 4183, పాస్‌కోడ్ epgo:1234 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. పీఎఫ్ పెన్షన్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు నూతక్కికి నీతి ఆయోగ్ ప్రతినిధి

మంగళగిరి: నీతి ఆయోగ్ ప్రతినిధి ప్రొఫెసర్ రమేష్ చంద్ శుక్రవారం మండలంలోని నూతక్కి గ్రామాన్ని సందర్శించనున్నారు. తొలుత దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడులో పర్యటించి, వరి రైతులతో చర్చించనున్నారు. అనంతరం మంగళగిరి మండలం నూతక్కిలోని అరటి, పసుపు రైతులతో ముఖాముఖిలో పాల్గొననున్నారు.